TGTEL/26/A7716

ఉద్యమ పోరు

UDYAMA PORU

ప్రతి పదం పోరాట కదం

వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 23 | గురువారం | 08.10.2026 | పేజీలు : 8 | వెల : 3 /- | ఎడిటర్ - బండారి సుమంత్

నా వీడియోలను మార్ఫింగ్ చేశారు

- బీఆర్ఎస్‌పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ ఫైర్

- తనపై బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని చామల ఆరోపణ
- బీఆర్ఎస్ అక్రమాస్తులు బయట పెడుతున్నందుకే ఈ దాడి అని వ్యాఖ్య
- వీడియోలు మార్ఫింగ్ చేసిన వారిపై కేసులు పెడతానని హెచ్చరిక

2

నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు..

వాటిని మెడల్స్ గా భావిస్తా : రాహుల్ గాంధీ

- తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై స్పందించిన రాహుల్ గాంధీ
- తనపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని వెల్లడి
- 'ఇండియా' కూటమి ఎంపీలతో ఖర్గే భోజన సమావేశం
- ఈసీపై పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం

2

దసరాకు 7,000 ప్రత్యేక బస్సులు..

30 మంది ఉంటే ఇంటికే వచ్చి పికప్: టీజీఎస్ఆర్టీసీ

- రాష్ట్రంలోని వివిధ జోన్ల నుంచి వేల సంఖ్యలో సర్వీసుల ఏర్పాటు
- ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సవరించిన టికెట్ ధరలు అమలు
- అక్టోబర్ 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే అవకాశం

2

సీఈసీ రాజీనామా చేసేవరకు

పోరాటం ఆగదు

- ఢిల్లీలో రాహుల్ గాంధీని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఘటనను తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి
- రాహుల్‌ను కలిసేందుకు యత్నించిన రేవంత్‌ను అడ్డుకున్న పోలీసులు
- ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్
- ఈసీని అడ్డుపెట్టుకుని ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని ఆరోపణ

ఉద్యమపోరు, ఢిల్లీ : ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా ఇతర విపక్ష నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను అప్రజాస్వామికమని ఆయన మండిపడ్డారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసే వరకు తమ పోరాటం ఆగదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. బుధవారం ఢిల్లీలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో రాహుల్ గాంధీని నిర్బంధించిన అనంతరం, ఆయనను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే, వారిని పోలీసులు లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడంతో పోలీసుల తీరుపై రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, మైనారిటీ వర్గాల ఓటు హక్కును లక్ష్యంగా చేసుకుని వివక్షా పూరితంగా వ్యవహరిస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. "గతంలో ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో లబ్ధి పొందిన వారు, ఇప్పుడు ఏకంగా ఎన్నికల కమిషన్‌నే పావుగా వాడుకుంటున్నారు" అని ఆయన ధ్వజమెత్తారు. అక్రమ అరెస్టులు, పోలీసుల నిర్బంధాలకు విపక్షాలు భయపడవని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, పౌరుల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు.

ఐదు లక్ష్యాలు నిర్దేశిస్తూ..

భారతీయులకు సరికొత్త నినాదం ఇచ్చిన ప్రధాని మోదీ

- 'మనం సాధించగలం' అంటూ మోదీ నినాదం
- ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని
- 2047 నాటికి వికసిత భారత్‌తో పాటు ఐదు భారీ లక్ష్యాల ప్రకటన

ఉద్యమపోరు, న్యూ ఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజల్లో సరికొత్త స్ఫూర్తిని నింపుతూ "మనం సాధించగలం" (We Will Do It) అనే కొత్త నినాదాన్ని ఇచ్చారు. తాను ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, బుధవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశం ముందు ఐదు భారీ లక్ష్యాలను ఉంచి, వాటిని సాధించి తీరాలని పిలుపునిచ్చారు. సరిగ్గా పాతికేళ్ల క్రితం, 2001 అక్టోబర్ 7న నరేంద్ర మోదీ తొలిసారిగా గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కేశూభాయ్ పటేల్ తర్వాత రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు.

మిగతా 2వ పేజీ లో..

శిశువు వైద్యం కోసం మంత్రిని ఆశ్రయించిన దంపతులు.. అండగా నిలిచిన కోమటిరెడ్డి

- బధిర దంపతుల బిడ్డ వైద్యానికి మంత్రి కోమటిరెడ్డి చేయూత
- తక్షణ సాయంగా రూ. 2 లక్షల ఆర్థిక సహాయం
- చిన్నారి సర్జరీ ఖర్చు మొత్తం భరిస్తానని హామీ

2

మహిళలకు రూ.2,500, బంగారం..

- ఆ ప్రచారంలో నిజం లేదన్న తెలంగాణ ప్రభుత్వం

- మహిళలకు రూ.2500 నెలవారీ సాయం అంటూ జరుగుతున్న ప్రచారం
- ఇది పూర్తిగా అసత్యమని కొట్టిపారేసిన ప్రభుత్వం
- సోషల్ మీడియా వదంతులను నమ్మవద్దని ప్రజలకు ప్రభుత్వ సూచన

2

అణువుల రహస్యాన్ని ఛేదించిన పరిశోధన.. ఇద్దరు శాస్త్రవేత్తలకు కెమిస్ట్రీ నోబెల్

2

త్వరలో బీజేపీలో కీలక పదవి అంటూ ప్రచారం..

- బండి సంజయ్ నోట ఆసక్తికర మాటలు!

- బీజేపీ తనకు ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్న కేంద్ర మంత్రి
- ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని వ్యాఖ్య
- పదవుల కోసం పాకులాడే వ్యక్తి కాదని వెల్లడి
- కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి డ్రామాలని విమర్శ

ఉద్యమపోరు, హైదరాబాద్ : కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు త్వరలో తెలంగాణ బీజేపీలో కీలక బాధ్యతలు అప్పగించనున్నారనే ప్రచారం జరుగుతున్న వేళ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ తనకు ఎన్నో పదవులు, అవకాశాలు ఇచ్చిందని చెప్పారు. తాను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని, కార్యకర్తగా పార్టీ కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని బీజేపీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో 'సేవా జ్యోతి' ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్.. కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పడం అంతా డ్రామానేనని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకునే దమ్ము కాంగ్రెస్‌కు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై పోరాడే సత్తా బీఆర్ఎస్‌కు లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు. ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ సహా విపక్షాలు చేస్తున్న విమర్శలపై బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. 'ఓట్ చోరీ, సీట్

2

చోరీ' పేటెంట్ కాంగ్రెస్‌కే ఉందని ఆరోపించారు. 1946లో ..

దసరాకు 7,000 ప్రత్యేక బస్సులు..
30 మంది ఉంటే ఇంటికే వచ్చి పికప్: టీజీఎస్ఆర్టీసీ

మొదటిపేజీ తరువాయి.. దసరా పండుగను పురస్కరించుకుని ప్రయాణికులు తమ స్వగ్రామాలకు సురక్షితంగా, సౌకర్యవంతంగా చేరుకునేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7,000 ప్రత్యేక బస్సులను నడప నున్నట్లు బుధవారం ప్రకటించింది. సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, కరీంనగర్ జోన్ పరిధిలో అత్యధికంగా 3,533 బస్సులు (ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1,175, వరంగల్ 530, ఖమ్మం 678) నడప నున్నారు. హైదరాబాద్ జోన్ నుంచి 2,155 బస్సులు (మహబూబ్‌నగర్ 645, మెదక్ 255, నల్గొండ 815, రంగారెడ్డి 440), గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయి. అక్టోబర్ 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుందని అంచనా వేస్తుండగా, తిరుగు ప్రయాణాల కోసం అక్టోబర్ 25, 26 తేదీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ ఒక నూతన సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కాలనీలు, టౌన్‌షిప్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, హాస్టళ్లు, కళాశాలల నుంచి కనీసం 30 మంది ప్రయాణికులు ఒక బృందంగా ఏర్పడి ముందస్తుగా బుక్ చేసుకుంటే, వారి వద్దకే బస్సును పంపి పికప్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ ప్రత్యేక బస్సు సర్వీసులకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం టికెట్ ధరలను సవరించినట్లు టీజీఎస్ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు..
వాటిని మెడల్స్ గా భావిస్తా : రాహుల్ గాంధీ

మొదటిపేజీ తరువాయి.. నిన్న ఈసీ కార్యాలయం ముట్టడి నేపథ్యంతో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను తేలిగ్గా తీసుకున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తన లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్ని ఎఫ్ఐఆర్ లు నమోదు చేసుకున్నా తానేమీ వెనుకంజ వేయబోనని, ఆ కేసులను మెడల్స్ గా భావిస్తానని అన్నారు. సీఈసీ పదవికి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేనని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో నేడు జన్‌పథ్‌లోని సాగర్ రత్న రెస్టారెంట్‌లో విపక్ష ఎంపీల భోజన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని, 'ఓట్ల దొంగతనం' అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా మాట్లాడుతూ.. 'ఇది లంచ్ మాత్రమే కాదు, ఒక లాంచ్ కూడా కావచ్చు' అని చమత్కరించారు. కాగా, మంవారం 'ఓట్ల దొంగతనం' జరిగిందంటూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిన్న విపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలు ఆకాశవాణి భవన్‌లోకి ప్రవేశించి సుమారు 8 గంటల పాటు బైఠాయించారు. అనుమతి లేకుండా భవనంలోకి ప్రవేశించినందుకు పోలీసులు వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌పై స్పందిస్తూ రాహుల్ గాంధీ, "నాపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి. నా లక్ష్యం 100" అని తేలికగా వ్యాఖ్యానించారు. భోజన భేటీ అనంతరం, ఎంపీలందరూ జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు సిద్ధంగా ఉన్న బస్సుల్లో బయలుదేరారు. మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్, జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు.

శిశువు వైద్యం కోసం మంత్రిని ఆశ్రయించిన దంపతులు.. అండగా నిలిచిన కోమటిరెడ్డి

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. పుట్టుకతో మాట, వినికిడి లోపంతో బాధపడుతున్న నవజాత శిశువు వైద్యం కోసం ఓ నిరుపేద బధిర దంపతులకు ఆయన రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందించారు. చికిత్సకు అయ్యే పూర్తి ఖర్చును తానే భరిస్తానని హామీ ఇచ్చి వారికి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితే, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఫణిగిరి గ్రామానికి చెందిన జంపాల మహేశ్ కుమార్, రజిత దంపతులు పుట్టుకతోనే మూగ, బధిరులు. ఇటీవల వారికి జన్మించిన శిశువుకు కూడా ఇదే సమస్య ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. చిన్న వయసులోనే సర్జరీ చేస్తే బిడ్డకు మాట, వినికిడి వచ్చే అవకాశం ఉందని, అయితే అందుకు లక్షల్లో ఖర్చవుతుందని తెలిపారు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆ దంపతులు హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డిని ఈరోజు కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. వారి పరిస్థితికి చలించిపోయిన మంత్రి, చిన్నారిని చేతుల్లోకి తీసుకుని వారికి ధైర్యం చెప్పారు. తక్షణ వైద్య ఖర్చుల నిమిత్తం వెంటనే రూ. 2 లక్షల రూపాయల సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "మీ చిన్నారి గురించి ఆందోళన వద్దు. ఆ బిడ్డకు మాటలు వచ్చేలా చేసే బాధ్యత నాది. మీకు ఎలాంటి సహాయం కావాలన్నా నేనున్నాను" అని వారికి భరోసా ఇచ్చారు. అంతేకాకుండా, మెరుగైన శస్త్రచికిత్స కోసం ప్రత్యేక వైద్యులతో తానే స్వయంగా మాట్లాడతానని హామీ ఇచ్చారు. మంత్రి హామీతో ఆ దంపతులు భావోద్వేగానికి గురై కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్న మంత్రి కోమటిరెడ్డిని స్థానికులు ప్రశంసించారు.

నా వీడియోలను మార్ఫింగ్ చేశారు
- బీఆర్ఎస్‌పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ ఫైర్

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరుకుంది. తాజాగా, తనపై బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియా వేదికగా ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులపై తాను వ్యతిరేకంగా మాట్లాడినట్లు తన వాయిస్‌ను, వీడియోలను ట్యాంపరింగ్ చేసి సర్క్యులేట్ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన చామల... బీఆర్ఎస్ నేతల పదేళ్ల అక్రమాస్తులను తాను బయటపెడుతున్నందుకే ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. "బీఆర్ఎస్ నేతల అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే నాపై కక్షగట్టి మార్ఫింగ్ వీడియోలతో దాడి చేస్తున్నారు. ఈ కుట్రల వెనుక ఉన్న వారిపై కచ్చితంగా కేసులు పెడతాను" అని ఆయన హెచ్చరించారు. ఈ ఘటనపై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ కూడా స్పందించారు. ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డిపై మార్ఫింగ్ వీడియోలు సృష్టించిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే ఈ ఆరోపణలపై బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. తెలంగాణ రాజకీయాల్లో మార్ఫింగ్ వీడియోల వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

ఐదు లక్ష్యాలు నిర్దేశిస్తూ..
భారతీయులకు సరికొత్త నినాదం ఇచ్చిన ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి..
ఈ ప్రత్యేకమైన రోజును కేవలం జ్ఞాపకాలకే పరిమితం చేయకుండా, దేశం కోసం కొత్త సంకల్పం తీసుకునే రోజుగా ఆయన మలిచారు. "ఈ రోజు కేవలం గతాన్ని స్మరించుకునేది మాత్రమే కాదు, మన సంకల్పంలో కొత్త శక్తిని నింపే రోజు. మనం ఏదైనా సాధించగలమనే వాగ్దానాన్ని పునరుద్ఘాటించే రోజు" అని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా, 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యంతో పాటు మరో ఐదు కీలక లక్ష్యాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల ముందుంచారు.
అవి:
1. ప్రపంచంలోని మొదటి మూడు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్‌ను నిలపడం.
2. ఆత్మనిర్భర్ భారత్ (స్వయం సమృద్ధి) సాధించడం.
3. భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా (గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్) తీర్చిదిద్దడం.
4. ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడం.
5. అంతరిక్షంలోకి మానవసహిత యాత్రను చేపట్టడం.

ప్రధాని మోదీ ఒక్కో లక్ష్యాన్ని ప్రకటిస్తున్నప్పుడు, స్టేడియంలోని వేలాది మంది ప్రజలు "మనం సాధించగలం" అంటూ మిన్నంటేలా నినదించారు. ఈ ఉత్సాహం, ఆత్మవిశ్వాసం అసాధారణమైనవని ప్రధాని ప్రశంసించారు. గతంలో సంక్షోభాలు తలెత్తినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యేదని, కానీ నేడు సంక్షోభ సమయాల్లో భారత్ చూపుతున్న పటిష్ఠత, స్థితిస్థాపకత గురించి ప్రపంచం చర్చించుకుంటోందని మోదీ అన్నారు. "ఒకప్పుడు దేశంలో విధానపరమైన స్తబ్దత (పాలసీ పారాలిసిస్) గురించి చర్చ జరిగేది. నేడు సంస్కరణల ఎక్స్‌ప్రెస్ గురించి మాట్లాడుకుంటున్నారు" అంటూ అప్పటి యూపీఏ-2 ప్రభుత్వాన్ని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. చిన్న లక్ష్యాలు పెట్టుకోవడం దేశ సామర్థ్యాన్ని తక్కువ చేయడమేనని, అందుకే భారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ లక్ష్యాలన్నీ 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకేనని మోదీ స్పష్టం చేశారు. ప్రతిపక్షాల నుంచి విమర్శలు, నిరసనలు ఎదురవుతున్న తరుణంలో, ఈ కార్యక్రమం ద్వారా పార్టీ శ్రేణుల్లో, మద్దతుదారుల్లో మోదీ ఆత్మవిశ్వాసం నింపే ప్రయత్నం చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) విషయంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ సాగుతున్న నిరసనలు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆరోపణలు, యూజీసీ మార్గదర్శకాలపై వ్యతిరేకత వంటి సవాళ్లను ప్రభుత్వం ఎదుర్కొంటోన్న నేపథ్యంలో, ప్రధాని ప్రసంగం బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్తేజాన్ని నింపింది.

అణువుల రహస్యాన్ని ఛేదించిన పరిశోధన..
- ఇద్దరు శాస్త్రవేత్తలకు కెమిస్ట్రీ నోబెల్

మొదటిపేజీ తరువాయి.. రసాయన శాస్త్రంలో, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 2026 నోబెల్ బహుమతిని ఇద్దరు శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. ఫ్రాన్స్‌లోని పారిస్-సడ్ విశ్వవిద్యాలయానికి చెందిన హెన్రీ బి. కగన్, జపాన్‌లోని టోక్యో యూనివర్సిటీ ఆఫ్ సైన్స్‌కు చెందిన కెన్సో సోయ్‌లకు ఈ గౌరవం దక్కింది. అసమాన సేంద్రియ సంశ్లేషణలో నాన్-లీనియర్ ఎఫెక్ట్స్, స్వీయ ఉత్ప్రేరణ వంటి కీలక ప్రక్రియలను ఆవిష్కరించినందుకు గాను వారిని ఈ పురస్కారం వరించినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. ప్రకృతిలో అనేక అణువు లు, ముఖ్యంగా మన శరీరంలోని అమైనో ఆమ్లాల వంటివి రెండు ప్రతిబింబ రూపాల్లో ఉం టాయి. అయితే, జీవరాశులు కేవలం ఒకే రూపా న్ని వినియోగించుకుంటాయి. ఈ రసాయన అసమానత లేదా 'హోమోకిరాలిటీ' ఎలా సాధ్యమవుతుందనేది శాస్త్రవేత్తలకు శతాబ్దాలుగా ఓ పెద్ద మిస్టరీ. ఈ రహస్యాన్ని ఛేదించడంలో కగన్, సోయ్ చేసిన పరిశోధనలు కీలకపాత్ర పోషిం చాయి. ఒక రసాయన చర్యలో ఊహించిన దాని కంటే ఎక్కువ స్థాయిలో ఒకే ప్రతిబింబ రూపాన్ని ఉత్పత్తి చేయవచ్చని హెన్రీ కగన్ తన పరిశోధనల ద్వారా నిరూపించారు. మరోవైపు కెన్సో సోయ్ స్వీయ ఉత్ప్రేరణ ప్రక్రియను అభివృద్ధి చేసి ఈ రంగంలో మరో ముందడుగు వేశారు. ఈ ప్రక్రియలో ఒక చర్య ద్వారా ఏర్పడిన ఉత్పత్తి, తనంతట తానే ఉత్ప్రేరకంగా పనిచేస్తూ అదే రకమైన అణువుల ఉత్పత్తిని వేగవంతం చేస్తుంది. దీనివల్ల అతి స్వల్ప అసమతుల్యతతో ప్రారంభమైనా, చివరికి దాదాపుగా ఒకే రూపానికి చెందిన అణువులు మాత్రమే ఏర్పడతాయి. ఈ ఆవిష్కరణలు అద్భుతమైనవని, శతాబ్దానికి పైగా ఉన్న రసాయన రహస్యాన్ని ఇది ఛేదించిందని నోబెల్ కమిటీ ఛైర్మన్ హైనర్ లింకే కొనియాడారు. కగన్, సోయ్‌ల పరిశోధనలు సైద్ధాంతికంగానే కాకుండా ఆచరణలో కూడా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఔషధాల తయారీ, సువాసనలు, పరిమళాలు, ఇతర రసాయన పదార్థాల ఉత్పత్తిలో అవసరమైన చర్యలను రూపొందించడానికి వీరి ఆవిష్కరణలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ పురస్కారం కింద ఇద్దరు శాస్త్రవేత్తలు 12 మిలియన్ల స్వీడిష్ క్రోనార్ల ప్రైజ్ మనీని పంచుకుంటారు. డిసెంబర్ 10న స్టాక్‌హోమ్‌లో జరిగే కార్యక్రమంలో వీరికి పతకాలను ప్రదానం చేస్తారు.

త్వరలో బీజేపీలో కీలక పదవి అంటూ ప్రచారం..
- బండి సంజయ్ నోట ఆసక్తికర మాటలు!

మొదటిపేజీ తరువాయి..
కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు త్వరలో తెలంగాణ బీజేపీలో కీలక బాధ్యతలు అప్పగించనున్నారనే ప్రచారం జరుగుతున్న వేళ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ తనకు ఎన్నో పదవులు, అవకాశాలు ఇచ్చిందని చెప్పారు. తాను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని, కార్యకర్తగా పార్టీ కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని బీజేపీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో 'సేవా జ్యోతి' ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్.. కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పడం అంతా డ్రామానేనని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకునే దమ్ము కాంగ్రెస్‌కు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై పోరాడే సత్తా బీఆర్ఎస్‌కు లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు. ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ సహా విపక్షాలు చేస్తున్న విమర్శలపై బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. 'ఓట్ చోరీ, సీట్ చోరీ' పేటెంట్ కాంగ్రెస్‌కే ఉందని ఆరోపించారు. 1946లో కాంగ్రెస్ పీసీసీలన్నీ సర్దార్ పటేల్ ప్రధాని కావాలని ప్రతిపాదించినా.. నెహ్రూను ప్రధాని చేశారని విమర్శించారు. దేశంలో బోగస్ ఓట్లు ఉన్నాయని కాంగ్రెస్సే చెప్పిందని, ఇప్పుడు వాటిని తొలగిస్తుంటే ఎందుకు అభ్యంతరం చెబుతోందని ప్రశ్నించారు. ప్రధాని మోదీకి ఓటు, సీటు చోరీ చేయాల్సిన అవసరం లేదన్నారు. కుటుంబం, బినామీ ఆస్తులు, వారసత్వ రాజకీయాలు ఆయనకు అవసరం లేదని చెప్పారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ సహా కొన్ని పార్టీలు చెప్పే మాటలు నమ్మి యువత మోసపోవద్దని బండి సంజయ్ సూచించారు. 2014కు ముందు, ఇప్పటి భారత్‌ను పోల్చి చూడాలని కోరారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ సంస్థ అని, అది బీజేపీ జేబు సంస్థ కాదన్నారు. రాజ్యాంగ సంస్థను బదనాం చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. ఎన్నికల సంఘాన్ని కలవాలంటే అపాయింట్‌మెంట్ తీసుకోవాలని రాహుల్ గాంధీకి సూచించారు. వందల మందితో వెళ్లి దాడి చేస్తే పోలీసులు అడ్డుకోక ఏం చేస్తారని ప్రశ్నించారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యమన్నారు. తెలంగాణలో అక్రమ చొరబాటుదారుల ఓట్లపై కూడా బండి సంజయ్ ఆరోపణలు చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోనే 30 వేలకు పైగా రోహింగ్యాల ఓట్లు ఉన్నాయని అన్నారు.

మహిళలకు రూ.2,500, బంగారం.. ఆ ప్రచారంలో నిజం లేదన్న ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి..
ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో, ప్రజలు ఇలాంటి నిరాధారమైన, తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. కేవలం ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా, సోషల్ మీడియాలో ధ్రువీకరణ లేకుండా వచ్చే వార్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రాష్ట్రంలో మహిళల కోసం కల్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలు ఇప్పటికే అమలవుతున్నాయి. అయితే, వైరల్ వీడియోలో పేర్కొన్నట్లుగా ప్రతినెలా రూ. 2,500 సాయం, రెండు తులాల బంగారం వంటి హామీలపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదని స్పష్టమవుతోంది. సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ కొందరు సృష్టిస్తున్న ఇలాంటి నకిలీ వార్తల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ వర్గాలు పునరుద్ఘాటించాయి.

యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్.. రూ.40,000 కోట్ల భారం ఎవరిదని ప్రశ్న!

ఉద్యమపోరు, హైదరాబాద్ : డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఎలాంటి కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తోం దని స్పష్టం చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే, ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి అస త్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. పదేళ్లు మంత్రిగా పని చేసిన హరీశ్‌రావు ఇలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం తగదని హితవు పలికారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి నుంచి బొగ్గు లింకేజీ ఇస్తామని హామీ ఇచ్చి యాదాద్రి ప్లాంట్‌ను ప్రారంభించిందని, కానీ ప్లాంట్‌కు అవసరమైన జీ9 గ్రేడ్ బొగ్గు సింగరేణిలో అందుబాటులో లేదని భట్టి గుర్తుచేశారు. సింగరేణి నుంచి 7 మిలియన్ టన్నులు, మిగిలింది దిగుమతి చేసుకుంటామని ఒప్పందాలు చేసుకున్నా, బీఆర్ఎస్ హయాంలో వాటిని నెరవేర్చలేదని విమర్శించారు. బొగ్గు అనుసంధానం లేకుండానే ప్లాంట్‌ను నిర్మించారా లేదా అనే దానిపై హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేసి మూడు యూనిట్లను ప్రారంభించిందని భట్టి వివరించారు. జెన్‌కో, ట్రాన్స్‌కోలను ప్రైవేటీకరిస్తారంటూ వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షాలు విద్యుత్ అంశంపై రాద్ధాంతం చేస్తున్నాయని, తమ ప్రభుత్వానికి ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

డా. వర్దెల్లి వెంకటేశ్వర్లు గారి మృతి పట్ల తీవ్ర సంతాపం

ఉద్యమపోరు, నర్సంపేట, అక్టోబర్ 07 : ఇటీవల మృతి చెందిన ప్రముఖులు డా. వర్దెల్లి వెంకటేశ్వర్లు గారి పార్థివ దేహానికిపూలమాలలు వేసి నివాళులు అర్పించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాయిడి రవీందర్ రెడ్డి మరియు నల్ల మనోహర్ రెడ్డి, తక్కలపెల్లి రవీందర్ రావు, మండల శ్రీనివాస్, గిరగాని సాంబయ్య గౌడ్, పెండ్యాల యాదగిరి, రాయిరాకుల సారంగపాణి , చుక్క అనిల్, కడారి కుమార్, దోనాల రవి, ముద్దంగుల రవి, బండి ప్రవీణ్, వేల్పుల శ్రీను, నీరటి రంజిత్, కార్యకర్తలు, అభిమానులు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డాక్టర్ వర్దెల్లి వెంకటేశ్వర్లు గౌడ్ గారి మృతి బాధాకరమని, ఆయన వైద్య వృత్తిలో సేవలను స్మరించుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కనకదుర్గమ్మ సన్నిధిలో సుద్దాల బాల్య మిత్రుల ఆత్మీయ కలయిక

- ఇంద్రకీలాద్రిపై సుద్దాల బాల్య మిత్రుల ఆధ్యాత్మిక యాత్ర
- కనకదుర్గమ్మను దర్శించుకున్న సుద్దాల బాల్య మిత్రులు
- కనకదుర్గమ్మ సన్నిధిలో నెమరువేసుకున్న బాల్య జ్ఞాపకాలు
- సుద్దాల బాల్య మిత్రుల ఆత్మీయ కలయికకు ఇంద్రకీలాద్రి వేదిక
- అమ్మవారి సన్నిధిలో సుద్దాల బాల్య మిత్రుల సందడి

ఉద్యమపోరు, సుద్దాల, అక్టోబర్ 07 : విజయవాడలోని ఇంద్రకీలాద్రి పర్వతంపై, పవిత్ర కృష్ణా నది ఒడ్డున శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, శ్రీ కనకదుర్గమ్మ ఆలయం వెలసి ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన ఈ ఆలయాన్ని సుద్దాల బాల్య మిత్రులు సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు.చిన్ననాటి స్నేహితులుగా కలిసి పెరిగిన వారు ఎంతో కాలం తర్వాత ఒకచోట చేరి అమ్మవారి దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. బాల్య స్నేహాన్ని గుర్తుచేసుకుంటూ ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణంలో కొంత సమయం గడిపారు. అమ్మవారి ఆశీస్సులతో తమ కుటుంబాలతో పాటు గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.కృష్ణా నది తీరంలోని ఇంద్రకీలాద్రి అందాలను వీక్షిస్తూ, పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ బాల్య మిత్రులు ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా సుద్దాల బాల్య మిత్రుల ఆత్మీయ కలయిక ప్రత్యేకంగా నిలిచింది.

వెల్జాల్ గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కాంగ్రెస్ నాయకుల వినతి

ఉద్యమపోరు, తలకొండపల్లి, అక్టోబర్ 07 : తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు.బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్న నాయకులు, గ్రామంలోని పలు పెండింగ్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వెల్జాల్ గ్రామంలో అంతర్గత రహదారుల మెరుగుదలకు నూతనంగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని, మురుగునీటి సమస్య పరిష్కారానికి అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు.అదేవిధంగా రాత్రి వేళల్లో వీధులన్నీ వెలుగులతో నిండేలా ఐమాక్స్ (హైమాస్ట్) లైట్లను మంజూరు చేయాలని ఎమ్మెల్యేను అభ్యర్థించారు.ఈ వినతులపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సానుకూలంగా స్పందించారని, నిధుల మంజూరుకు త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు జి. శ్రీనివాస మూర్తి,ఎం.అంజాజీ, మాజీ సింగల్ విండో చైర్మన్ ఏ. అంజయ్య గౌడ్, మాజీ ఉప సర్పంచ్ బి. నరసింహులు, అజీజ్, కాంగ్రెస్ నాయకులు పి. అశోక్ బాబు, ఏ. వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ ఆరిఫ్, మాజీ సింగల్ విండో డైరెక్టర్ టి. కృష్ణయ్య గౌడ్, వద్దే రాజు, పులిజాల విష్ణు, ఈ. రాఘవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకున్న సుద్దాల బాల్య మిత్రులు

ఉద్యమపోరు, సుద్దాల, అక్టోబర్ 07 : ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలో, మోపిదేవి మండల కేంద్రంలోని మోపిదేవి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయం ప్రముఖ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు.ఈ సందర్భంగా సుద్దాల గ్రామానికి చెందిన బాల్య మిత్రులు మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కొంతసేపు ఆధ్యాత్మిక వాతావరణంలో గడిపారు.చిన్ననాటి నుంచి కలిసి పెరిగిన సుద్దాల బాల్య మిత్రులు చాలా కాలం తర్వాత ఒకచోట చేరి పుణ్యక్షేత్రాన్ని సందర్శించడం ఆనందాన్ని కలిగించింది. ఈ సందర్భంగా వారు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. స్నేహబంధం, ఆత్మీయతను గుర్తుచేసుకుంటూ పరస్పరం అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారి దర్శనం తమకు ఎంతో ఆధ్యాత్మిక ప్రశాంతతను, ఆనందాన్ని కలిగించిందని బాల్య మిత్రులు తెలిపారు. స్వామివారి కృపతో సుద్దాల గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం స్నేహితుల మధ్య ఆత్మీయతకు ప్రతీకగా నిలిచింది.

పాఠశాలను సందర్శించిన ఇక్రిశాట్ సంస్థ.

ఉద్యమపోరు, ఇల్లందు, అక్టోబర్ 07 : భద్రాద్రికొత్తగూడెం /టేకులపల్లి మండలం కొప్పురాయి పంచాయతీ పరిధిలో జి పి ఎస్. ఒడ్డుగూడెం పాఠశాలను హైదరాబాదు నుండి వచ్చిన ఇక్రిశాట్ సంస్థ వారు.ఐటీడీఏ జి సి డి ఓ. బృందం జిపిఎస్ ఒడ్డుగూడెం పాఠశాలను సందర్శించి స్కూల్లో కావలసిన మౌలిక సదుపాయాలు ఎం డి ఎం పిల్లలకు కావలసిన పౌష్టికాహారం. కావలసిన వస్తువులు వాటి అవసరాలు ఉపయోగాల గురించి పూర్తిగా వివరించారు.పిల్లల తల్లిదండ్రుల నుంచి ఉపాధ్యాయుల నుంచి పిల్లల నుంచి పూర్తి సమాచారం కోసం సుమారు రెండు గంటల పాటు అన్ని విషయాలపై చర్చించడం సమగ్ర సమాచారం తీసుకోవడం జరిగినది దీని కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చింత కళ్యాణ్ పంచాయతీ సెక్రటరీ సంజీవరావు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో పాడి గేదె మృతి

- రైతుకు రూ.1.20 లక్షల నష్టం

ఉద్యమపోరు, దిండి(గుండ్లపల్లి), అక్టోబర్ 07 : గుండ్లపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై ఓ పాడి గేదె మృతి చెందింది. ఈ ఘటనతో రైతు కుటుంబానికి సుమారు రూ.1.20 లక్షల మేర ఆర్థిక నష్టం వాటిల్లింది.ఖానాపూర్ గ్రామానికి చెందిన రైతు ★ఇడెమోని తిరుపతయ్య (తండ్రి: బుచ్చయ్య)★కు చెందిన సుమారు ఐదున్నరేళ్ల పాడి గేదె వ్యవసాయ పొలం వద్ద మేత మేస్తుండగా, సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైంది. విద్యుత్ తీవ్రత అధికంగా ఉండడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది.ఘటనస్థలాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి పరిశీలించి, మృతి చెందిన గేదె వయస్సు సుమారు 5 సంవత్సరాల 6 నెలలు కాగా, దాని విలువ సుమారు రూ.1,20,000గా నిర్ధారిస్తూ ధృవీకరణ పత్రం జారీ చేసినట్లు సమాచారం.తమ జీవనాధారంగా ఉన్న పాడి గేదె అకస్మాత్తుగా విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందడంతో రైతు కుటుంబం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది. విద్యుత్ శాఖ అధికారులు, ప్రభుత్వం స్పందించి ఘటనపై పరిశీలన జరిపి, బాధిత రైతుకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

తలకొండపల్లిలో వైభవంగా ‘జాతీయ పోషణ మాసం’

- సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు కటికల శేఖర్ యాదవ్

ఉద్యమపోరు, తలకొండపల్లి, అక్టోబర్ 07 : తలకొండపల్లి మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన సర్పంచుల సంఘం అధ్యక్షుడు, సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య, ఉప సర్పంచ్ నూకం కోటీశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ..గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అంజయ్య సెట్, వార్డు సభ్యులు వెంకటేష్ యాదవ్, కిషోర్, విఠల్, ఐసీడీఎస్ అంగన్‌వాడీ సూపర్వైజర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, గ్రామ మహిళలు, తల్లులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
గురువారం 087.10.2026

దసరా.. సద్దుల బతుకమ్మకు పకడ్బందీ ఏర్పాట్లు

- 5వ తరగతి బాలికలను కొట్టినట్లు ఆరోపణలు.. కలెక్టర్ సుమోటో స్పందన
- విచారణ నివేదిక ఆధారంగా ఉపాధ్యాయురాలిపై చర్యలు

ఉద్యమపోరు, వరంగల్/ నెక్కొండ,అక్టోబర్ 07 : వరంగల్ జిల్లా నెక్కొండలోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికలు)లో ఐదో తరగతి విద్యార్థులపై బెత్తంతో దాడి చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో వెలువడిన కథనాలపై జిల్లా కలెక్టర్ సత్యశారద సుమోటోగా స్పందించారు. ఘటనపై ప్రాథమిక విచారణ చేపట్టేందుకు ఎంపీడీవోను నియమించారు.విచారణలో వచ్చిన నివేదిక ఆధారంగా విద్యార్థులను బెత్తంతో కొట్టినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు రజినిని సస్పెండ్ చేస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు. విద్యార్థులపై ఎలాంటి వేధింపులు, శారీరక దాడులను సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థుల భద్రత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.

సేవా జ్యోతి యాత్రకు హనుమకొండలో ఉత్సాహభరిత స్పందన

- అంబేడ్కర్ జంక్షన్ నుంచి అమరవీరుల స్థూపం వరకు యాత్ర
- దివిటీలు, పార్టీ జెండాలతో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

ఉద్యమపోరు, హనుమకొండ ,అక్టోబర్ 07 : హనుమకొండ నగరంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం 'సేవా జ్యోతి యాత్ర' ఉత్సాహభరితంగా నిర్వహించారు. 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా చేపట్టిన ఈ యాత్ర స్థానిక అంబేద్కర్ జంక్షన్ నుంచి ప్రారంభమై అమరవీరుల స్థూపం వరకు కొనసాగింది. బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్ రావు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు చేతుల్లో దివిటీలు, పార్టీ జెండాలు పట్టుకుని పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మురళీధర్ రావు మాట్లాడుతూ ప్రజల్లో సేవా భావాన్ని పెంపొందించడమే సేవా జ్యోతి యాత్ర ప్రధాన ఉద్దేశమన్నారు. కేంద్ర ప్రభుత్వం, పార్టీ ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ, సేవా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు తీసుకెళ్లడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ స్థానిక, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, కార్యకర్తలు, మహిళా మోర్చా ప్రతినిధులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం లక్ష్యంగా పనిచేయాలి

- అర్హులైన పట్టభద్రుల ఓటు నమోదు వేగవంతం చేయాలిబీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పిలుపు

ఉద్యమపోరు, వరంగల్ ,అక్టోబర్ 07 : వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పిలుపునిచ్చారు. ఖిలా వరంగల్ మండల కన్వీనర్ కర్నే రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2023 నవంబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన ప్రతి అర్హుడైన పట్టభద్రుడు తప్పనిసరిగా ఎమ్మెల్సీ ఎన్నికల ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులకు ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించి, నమోదు వేగవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఓటర్లను చైతన్యపరచడంతో పాటు పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో బీజేపీ ఖిలా వరంగల్ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి అర్జున్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు కర్నే వాసుదేవ్, సీనియర్ నాయకులు కత్తి సాంబయ్య, శ్రీరామ్ నాగరాజు, ఏలుగు రవికుమార్, గందె గోపి, సర్ల సంజీవ్, రావుల రాజేశ్వర్, పాలపోయిన వర్షిత్, కార్తీక్, వంశీ, వరుణ్, ఆదిత్యతో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

స్మశాన వాటిక రహదారికి మరమ్మతులు

- వర్షాకాలంలో ప్రజల ఇబ్బందులకు పరిష్కారం చూపేలా పనులు
- వీబీజీ రాంజీ పథకం నిధులతో అభివృద్ధి పనులు

ఉద్యమపోరు, ములుగు జిల్లా/తాడ్వాయి ,అక్టోబర్ 07 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాటాపురం గ్రామపంచాయతీ పరిధిలోని స్మశాన వాటిక, చెత్త నిల్వ కేంద్రానికి వెళ్లే రహదారిని గ్రామ సర్పంచ్ దిడ్డి మోహన్‌రావు బుధవారం పరిశీలించారు. వర్షాకాలంలో రహదారి అధ్వానంగా మారడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మరమ్మతు పనులను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వీబీజీ రాంజీ పథకంలో భాగంగా ఈ పనులకు నిధులు మంజూరు కావడంతో రహదారి సమస్యకు పరిష్కారం లభించినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పథకం నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గ్రామంలోని మురుగునీటి కాలువలు, పంట కాలువలు, నీటి నిల్వ కార్యక్రమాలు, పారిశుద్ధ్య సమస్యలు, ఇంకుడు గుంతల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఈ పథకం ద్వారా అవకాశం ఉందన్నారు. అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగించుకుని కాటాపురం గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకట రామనరసయ్య, సాంకేతిక సహాయకుడు, క్షేత్ర సహాయకుడు రాసూరు సంజీవ, కుసుమ వెంకటేశ్వర్లు, గండు సదయ్య, దొడ్డపల్లి సాంబయ్య, చిట్టినేని శ్రీనివాస్, గడ్డం మొగిలి తదితరులు పాల్గొన్నారు..

హన్మకొండలో డిజిటల్ తెరపై మోదీ ప్రసంగం

- భారీ తెరపై ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించిన బీజేపీ శ్రేణులు
- కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు

ఉద్యమపోరు, హన్మకొండ ,అక్టోబర్ 07 : 'వికసిత్ భారత్' కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాన్ని హన్మకొండలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన భారీ డిజిటల్ తెరపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దేశాభివృద్ధి, సంక్షేమ పథకాలు, వికసిత్ భారత్ లక్ష్యాలపై ప్రధానమంత్రి అందించిన సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్ రావు, జిల్లా అధ్యక్షుడు సంతోష్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రావు పద్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా జినుకల లక్ష్మణరావు

- నియామక పత్రం అందజేసి ఘనంగా సన్మానం

ఉద్యమపోరు, హన్మకొండ ,అక్టోబర్ 07 : ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా జినుకల లక్ష్మణరావును నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు.ఉద్యమకారుల హక్కులు, సంక్షేమం కోసం ఐక్య వేదికను మరింత బలోపేతం చేసేందుకు జినుకల లక్ష్మణరావు కృషి చేయాలని గుడిమళ్ల రవికుమార్ ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మణరావుకు అభినందనలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించినందుకు జినుకల లక్ష్మణరావు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఐక్య వేదిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

400 బైకులతో సేవా జ్యోతి యాత్ర

- ఎల్కతుర్తి నుంచి సిద్ధిపేట వరకు కొనసాగిన బైక్ ర్యాలీ
- మోదీ ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసిన బీజేపీ శ్రేణులు

ఉద్యమపోరు, ఎల్కతుర్తి, అక్టోబర్07 : ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా ఎల్కతుర్తి నుంచి సిద్దిపేట వరకు సేవా జ్యోతి యాత్రను బీజేపీ శ్రేణులు బైక్ ర్యాలీగా నిర్వహించారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు మద్దతు శ్రీకాంత్ యాదవ్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎల్కతుర్తి నుంచి భీమదేవరపల్లి మీదుగా హుస్నాబాద్ చేరుకున్న ర్యాలీలో వివిధ ప్రాంతాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం హుస్నాబాద్ నుంచి సేవా జ్యోతిని సిద్దిపేట వరకు కొనసాగించారు. ఎల్కతుర్తి మండలం నుంచి సుమారు 60 బైకులు, వివిధ ప్రాంతాల నుంచి కలిపి దాదాపు 400 బైకులతో పార్టీ శ్రేణులు ర్యాలీలో పాల్గొన్నారు. ప్రధాని మోదీ సేవా స్ఫూర్తి, దేశాభివృద్ధి సంకల్పాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో సేవా జ్యోతి యాత్ర నిర్వహించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా మద్దతు శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవిస్తూ దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తూ సేవా జ్యోతి యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. దేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం మోదీ మరింత కాలం సేవలందించాలని కోరుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
గురువారం 08.10.2026

ఘనంగా సమాచార హక్కు సాధన కమిటీ రెండో ఆవిర్భావ సభ

- రవీంద్రభారతిలో నిర్వహణ.. రాష్ట్రవ్యాప్తంగా 800 మంది కార్యకర్తల హాజరు
- పాలనలో పారదర్శకత, జవాబుదారీతనానికి సమాచార హక్కు చట్టం కీలకం

ఉద్యమపోరు, పెద్దపల్లి జిల్లా/మంథని, అక్టోబర్ 07 : సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రెండో ఆవిర్భావ సభ హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సమాచార హక్కు కమిషనర్ దేశాల భూపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సుమారు 800 మంది సమాచార హక్కు కార్యకర్తలు సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం ప్రాధాన్యత, ప్రజలకు చట్టంపై అవగాహన కల్పించాల్సిన అవసరం, అందుబాటులో ఉన్న సమాచార హక్కును ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిన అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంలో సమాచార హక్కు చట్టం కీలక పాత్ర పోషిస్తుందని వక్తలు పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి ప్రజలకు సమాచార హక్కు చట్టంపై మరింత అవగాహన కల్పించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. చట్టం ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతోపాటు, చట్టంపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ అవగాహన కార్యక్రమాలను కొనసాగించాలని కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్, జాతీయ ఉపాధ్యక్షుడు గోపీనాథన్, జాతీయ కార్యదర్శి తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సభకు పెద్దపల్లి జిల్లా నుంచి జిల్లా అధ్యక్షుడు పాంద్రాల రాజు, జిల్లా ఇన్‌చార్జ్ తోగరి సురేష్, జిల్లా సామాజిక మాధ్యమాల ఇన్‌చార్జ్ కొమురోజు సురేష్, జిల్లా సమన్వయకర్త అశోక్‌కుమార్, జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షుడు వేగోలపు సురేష్, జిల్లా అధికార ప్రతినిధులు కాశిపేట శ్రీకాంత్, కల్వల యశ్వంత్, జిల్లా ఉపాధ్యక్షులు యాసం శ్రావణ్, ఆర్ల సనిల్, జిల్లా కార్యదర్శి బూడిద అనిల్ హాజరయ్యారు. అదేవిధంగా మంథని నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సునీల్, నియోజకవర్గ సామాజిక మాధ్యమాల ఇన్‌చార్జ్ ఆకుల రాఘవ ముదిరాజ్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు బూడిద రాజు, రామగుండం డివిజన్ ఉపాధ్యక్షుడు రామచందర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు అక్కల దేవేందర్, మంథని డివిజన్ సామాజిక మాధ్యమాల ఇన్‌చార్జ్ ఎల్పుల స్మార్ట్, మంథని డివిజన్ ఉపాధ్యక్షుడు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పోషక మాసం సందర్భంగా ఘనంగా సామూహిక శ్రీమంతాలు

- గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించిన వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది
- ప్రభుత్వ ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచన

ఉద్యమపోరు, జనగామ జిల్లా/రఘునాథపల్లి, అక్టోబర్ 07 : పోషక మాసం సందర్భంగా రఘునాథపల్లి మండలం కోమల్ల సెక్టార్ పరిధిలోని కోమల్ల గ్రామంలో గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోమల్ల గ్రామ ఉపసర్పంచ్ నర్ర అశోక్, వైద్యురాలు పావని, ఏఎన్ఎం రజిత, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు నసీమున్నిసా బేగం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోషక విలువలు కలిగిన వివిధ ఆహార పదార్థాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను వారు పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఉపసర్పంచ్ నర్ర అశోక్ సూచించారు. వైద్యురాలు పావని మాట్లాడుతూ గర్భిణులు ఐరన్ మాత్రల వినియోగం, రక్తహీనత నివారణ, టి.టి. టీకా తదితర ఆరోగ్య అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గర్భధారణ సమయంలో పోషకాహారం తీసుకోవడంతోపాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు నసీమున్నిసా బేగం మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు, పోషకాహార కార్యక్రమాల గురించి వివరించారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోమల్ల సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, ఆశా కార్యకర్తలు, వీవీఏలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు భేషరతుగా రూ.4 వేల పింఛన్ ఇవ్వాలి

- దరఖాస్తు చేసుకున్న ప్రతి కార్మికుడికి ఎలాంటి షరతులు లేకుండా పింఛన్ మంజూరు చేయాలి
- గుడుంబా తయారీని అరికట్టకపోతే గీత కార్మికుల జీవనోపాధికి తీవ్ర నష్టం: గండు సదయ్య

ఉద్యమపోరు, ములుగు జిల్లా/తాడ్వాయి , అక్టోబర్ 07 : దరఖాస్తు చేసుకున్న ప్రతి గీత కార్మికుడికి ఎలాంటి షరతులు విధించకుండా నెలకు రూ.4 వేల పింఛన్ మంజూరు చేయాలని తాడ్వాయి మండల గీత కార్మికుల అధ్యక్షుడు గండు సదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గీత కార్మికులు ప్రమాదాలకు గురైనప్పుడు వారికి అందాల్సిన బీమా ప్రయోజనాలు కూడా సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో గుడుంబా తయారీ రోజురోజుకూ పెరుగుతుండటంతో నాణ్యమైన తాటికల్లుకు ఆదరణ తగ్గుతోందని తెలిపారు. తాటికల్లు విక్రయాలు తగ్గిపోవడంతో గీత కార్మికుల జీవనోపాధి దెబ్బతింటోందన్నారు. గుడుంబా తయారీని అరికట్టడంలో ఆబ్కారీ శాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.తాటి చెట్లపై ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తూ, ప్రాణాలను సైతం పణంగా పెట్టి గీత కార్మికులు నాణ్యమైన తాటికల్లును ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. మరోవైపు గుడుంబా తయారీదారులు ఎలాంటి నిబంధనలు పాటించకుండా నాసిరకం, హానికర పదార్థాలను కలిపి గుడుంబా తయారు చేస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడటంతో పాటు గీత కార్మికుల జీవనోపాధిపై కూడా తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం గుడుంబా తయారీపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆబ్కారీ శాఖను సమర్థవంతంగా పని చేయించాలని కోరారు. గుడుంబా తయారీని అరికట్టకపోతే అనేక గీత కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి గుడుంబా తయారీని అరికట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాలకుర్తి వెంకట రామనరసయ్య గౌడ్, పులిచిన నర్సయ్య గౌడ్, గడ్డం మొగిలి గౌడ్, సామాజిక మాధ్యమాల కార్యదర్శి బెల్లంకొండ నరేష్, మండల ప్రధాన కార్యదర్శి సిరి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయం

- మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలి: ఎమ్మెల్యే నాయని రాజేందర్‌రెడ్డి
- 200 మంది మైనారిటీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ

ఉద్యమపోరు, హన్మకొండ , అక్టోబర్ 07 : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పారదర్శకంగా అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయని రాజేందర్‌రెడ్డి అన్నారు. హన్మకొండలోని అంబేద్కర్ భవన్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన 200 మంది అర్హులైన ముస్లిం మైనారిటీ మహిళలకు ఎమ్మెల్యే ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించి, తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ ఉద్దేశమని ఎమ్మెల్యే తెలిపారు.మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న స్వయం ఉపాధి అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో గాయపడిన చిన్నారులకు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

- బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందజేతమెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరిన కాకులమర్రి ప్రదీప్‌రావు

ఉద్యమపోరు, ములుగు, అక్టోబర్ 07 : అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను బీఆర్ఎస్ నాయకుడు కాకులమర్రి ప్రదీప్‌రావు పరామర్శించారు. ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు ఆదేశాల మేరకు ఆయన ఆస్పత్రికి వెళ్లి చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన కుమ్మరి రమేష్, నాగలక్ష్మి దంపతుల చిన్నారులు నిహాస్వి (5), నిహాంత్ (2) చెత్త కుప్పల వద్ద చెలరేగిన మంటల ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను ప్రదీప్‌రావు పరామర్శించి, వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ప్రదీప్‌రావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు కావిరి చిన్నికృష్ణతో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోకుదెబ్బలో పల్లె గౌడ కుటుంబాల చేరిక

- పేద గీత కార్మికులకు అండగా నిలుస్తాం: కోటగిరి అరుణ్‌కుమార్ గౌడ్
- గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని బలోపేతం చేస్తాం

ఉద్యమపోరు, నిజామాబాద్ ,అక్టోబర్ 07 : గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ మండలం పల్లె గ్రామపంచాయతీ పరిధికి చెందిన 15 గౌడ కుటుంబాలు జిల్లా గౌడ సంఘానికి రాజీనామా చేసి, మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు కోటగిరి అరుణ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సంఘంలో చేరినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు కోటగిరి అరుణ్‌కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మెరుగు శ్రీనివాస్ గౌడ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు వేంపల్లి సరోజ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు బొజ్జ చిన్నాగౌడ్, జిల్లా కార్యదర్శి వేంపల్లి సంతోష్ గౌడ్, జిల్లా నాయకుడు బొడ్డు తిరుపతి గౌడ్ మాట్లాడుతూ.. ఎర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో 39 గీత కార్మిక కుటుంబాలు, 11 దళిత కుటుంబాలను సాంఘిక బహిష్కరణకు గురిచేయడం అన్యాయమన్నారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకుని అరెస్టు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్మూర్ మండలంలో కొందరు గౌడ కులస్తులు పేద గీత కార్మిక కుటుంబాలను వృత్తి చేసుకోకుండా వేధింపులకు గురిచేస్తున్నారని వారు ఆరోపించారు. ఆర్థిక, రాజకీయ అండదండలతో పేద గౌడ కుటుంబాలను అణచివేయడాన్ని మోకుదెబ్బ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. పేద గౌడ గీత కార్మికులు, గౌడ కులస్తులకు అండగా మోకుదెబ్బ నిలుస్తుందని, గౌడ కులస్తులందరికీ సమాన హక్కులు, వాటాలు దక్కే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గౌడ కులస్తుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా మోకుదెబ్బను బలోపేతం చేస్తామని తెలిపారు. త్వరలో రాష్ట్ర నాయకులను జిల్లాకు ఆహ్వానించి భారీ సభ నిర్వహించి పేద గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి పోరాటాన్ని మరింత విస్తృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పల్లె గౌడ కులస్తులు భైరగోని సాయగౌడ్, బూరుగు రాజుగౌడ్, ఉదగామ్ బాలరాజ్ గౌడ్, రంగారి పోషగౌడ్, బొంగోని ఆంజనేయులు గౌడ్, ఉదగామ్ సత్యనారాయణ గౌడ్, ఏనుగంటి వివేక్ గౌడ్, భైరగోని సచిన్ గౌడ్, బొంగోని నవీన్ గౌడ్, ఏనుగంటి మహేష్ గౌడ్, భైరగోని సిరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ ను సందర్శించిన కలెక్టర్

ఉద్యమపోరు, నిజామాబాద్, అక్టోబర్ 07 : జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి,అదనపు కలెక్టర్ వి.భుజంగరావు తో కలిసి సందర్శించారు.సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు.ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించారు.ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు.కలెక్టర్ వెంట అగ్నిమాపక శాఖ అధికారి శంకర్,ఎన్నికల విభాగం సిబ్బంది సాత్విక్,విజయేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

తిమ్మారెడ్డిగూడలో హర్ ఘర్ జల్ కార్యక్రమం

ఉద్యమపోరు, షాబాద్, అక్టోబరు 7 : షాబాద్ మండలంలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో హర్ ఘర్ జల్ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గుత్తి చెన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందేలా ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గ్రామంలో నీటి సరఫరా పైపులైన్లు, కనెక్షన్లు, నీటి లభ్యత తదితర అంశాలను పరిశీలించి, అవసరమైన చోట తగిన చర్యలు తీసుకోవాలని అధికారులు తెలిపారు. తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని గ్రామస్తులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ హారిక, ఏఈ, లైన్మెన్లు, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మరణించిన షేక్ ఫరీద్ కుటుంబానికి పి.జి.ఆర్ ఆర్థిక సహాయం

ఉద్యమపోరు, గుర్రంపోడు, అక్టోబర్ 07 గుర్రంపోడు మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో బొడ్రాయి ఎదురుగా నివాస ముంటూ ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించిన షేక్ ఫరీద్ కుటుంబ సభ్యులను బుధవారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి (పి.జి.ఆర్) పరామర్శించారు.ఫరీద్ మృతి పట్ల వారు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ఆర్థిక సహాయాన్ని అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో వేముల యాదయ్య,షేక్ కాసిం, వినయ్,జానీ పాషా,పవన్, వేముల సరస్వతి,మహమ్మద్ అబ్బాస్,వేముల లక్ష్మమ్మ, ఇటికాల లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంథనిలో పలు కుటుంబాలను పరామర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు

ఉద్యమపోరు, మంథని, అక్టోబర్-07 : మంథని పట్టణంలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం పరామర్శించారు. గోదావరి గౌతమేశ్వరి ఆలయం సమీపంలోని గట్టు సుశీల, పెంజూరుకట్టకు చెందిన మున్ననూరి ఆనందదేవి, నడివీధిలోని లక్ష్మీ నారాయణ ఆలయం సమీపంలో చొప్పకట్ల శంకర్‌రావు, ఉస్మాన్‌పురకు చెందిన ఎం.డి. వలి కుటుంబాలను ఆయన పరామర్శించి, మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్ , వైస్ చైర్మన్, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వీరాపురం ర్యాంపుతో టి. కొత్తగూడెం గ్రామానికి తీవ్ర నష్టం..

- రోడ్లు ధ్వంసం, అడుగంటిన బోర్లు!
- పంచాయతీకి ఆర్థిక నష్టం, వ్యవసాయానికి ఇబ్బందులు

ఉద్యమపోరు, పినపాక, అక్టోబర్ 07 : వీరాపురం ఇసుక ర్యాంపు కార్యకలాపాల వల్ల టీ. కొత్తగూడెం గ్రామపంచాయతీతో పాటు గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ కనితి సుమలత, ఉప సర్పంచ్ రాయల నరసమ్మ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ర్యాంపు నిర్వహణ కారణంగా గ్రామానికి, స్థానిక ప్రజలకు జరుగుతున్న నష్టాలపై అధికారులు సమగ్రంగా పరిశీలించి ప్రజలకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ధ్వంసమవుతున్న రహదారులు – పెరుగుతున్న దుమ్ము: ర్యాంపు నుండి భారీ వాహనాలు తరచూ రాకపోకలు సాగిస్తుండటంతో గ్రామంలోని ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతింటున్నాయని స్థానిక ప్రజాప్రతినిధులు తెలిపారు. రోడ్లు ధ్వంసం కావడంతో పంచాయతీ తరచూ మరమ్మతులు చేయించాల్సి వస్తోందని, దీనివల్ల గ్రామపంచాయతీ ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతోందని పేర్కొన్నారు. అంతేకాకుండా, వాహనాల రాకపోకల వల్ల గ్రామంలో దుమ్ము విపరీతంగా పెరిగిపోయి, పర్యావరణ సమస్యలతో పాటు వ్యవసాయ రంగానికి కూడా తీవ్ర విఘాతం కలుగుతోందని తెలిపారు.తాగునీరు, సాగునీటికి ముప్పు, పనిచేయనిబోర్లు: ర్యాంపు కార్యకలాపాల ప్రభావంతో గ్రామంలోని బోర్లు సరిగా పనిచేయడం లేదని, నీటి లభ్యత తగ్గిపోవడంతో గ్రామస్తులు తాగునీరు, సాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారని వివరించారు. ఒకవైపు పంచాయతీకి ఆర్థిక భారం పడుతుంటే, మరోవైపు రోడ్ల ధ్వంసం, దుమ్ము, బోర్ల సమస్యలతో ప్రజల జీవనం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపరిహారంగా లారీలపై పట్టాలు కట్టే అవకాశం కల్పించాలి: గ్రామానికి జరుగుతున్న ఈ నష్టానికి పరిహారంగా, టీ. కొత్తగూడెం గ్రామస్తులకు మూడు రోజుల పాటు లారీలపై పట్టాలు కట్టే అవకాశం కల్పించాలని సర్పంచ్ కనితి సుమలత డిమాండ్ చేశారు. గతంలో కూడా గ్రామస్తులు ఉమ్మడిగా లారీలపై పట్టాలు కట్టి ఉపాధి పొందే వారని, ఇప్పుడు కూడా అదే తరహాలో అవకాశం ఇవ్వాలని కోరారు.ర్యాంపు నిర్వాహకులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గ్రామ ప్రజల సమస్యలను పరిశీలించాలని, టీ. కొత్తగూడెం గ్రామానికి సరైన నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

మోకుదెబ్బలో పల్లె గౌడ కుటుంబాల చేరిక

- పేద గౌడ కులస్తులకు అండగా మోకుదెబ్బ
: జిల్లా అధ్యక్షులు కోటగిరి అరుణ్ కుమార్ గౌడ్

ఉద్యమపోరు, నిజామాబాద్, అక్టోబర్ 07 : బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు.మోకుదెబ్బ జిల్లా అధ్యక్షులు కోటగిరి అరుణ్ కుమార్ గౌడ్,ప్రధాన కార్యదర్శి మెరుగు శ్రీనివాస్ గౌడ్,జిల్లా మహిళా అధ్యక్షులురాలు వేంపల్లి సరోజ గౌడ్,జిల్లా ఉపాధ్యక్షులు బొజ్జ చిన్నాగౌడ్ జిల్లా కార్యదర్శి వేంపల్లి సంతోష్ గౌడ్,జిల్లా నాయకులు బొడ్డు తిరుపతి గౌడ్ గార్లు మాట్లాడుతూ......నిజామాబాద్ జిల్లా గౌడ సంఘానికి అర్మూర్ మండలంలోని పల్లె గ్రామపంచాయతికి చెందిన 15 గౌడ కుటుంబాలు జిల్లా గౌడ సంఘానికి రాజీనామా చేసి గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జిల్లా అధ్యక్షులు కోటగిరి అరుణ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జాయిన్ కావడంజరిగింది. నాయకులు మాట్లాడుతూ....ఎర్గట్ల మండలం తాళ్ళ రాంపూర్ గ్రామంలో విడీసీ 39 గీత కార్మిక కుటుంబాలను,11 దళిత కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేయడం అన్యాయం అన్నారు.సాంఘిక బహిష్కరణకు గురిచేసిన వారి పైన వెంటనే చర్యలు తీసుకొని అరెస్టు చేసి కటినంగా శిక్షించి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లా పోలీస్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ మండలంలో కొంతమంది గౌడ కులస్తులు పేద గీత కార్మిక కుటుంబాలను వృత్తిని చేసుకోకుండా వేధింపులకు గురిచేస్తూ ఆర్థిక రాజకీయ అండదండలతో అణిచివేయడాన్ని గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ తీవ్రంగా ఖండిస్తూ పేద గౌడ గీత కార్మికులకు గౌడ కులస్తులకు అండగా మోకుదెబ్బ నిలుస్తుందని గౌడ కులస్తులందరికీ సమాన వాటాలు దక్కేవరకు పోరాడుతుందని పల్లె గ్రామ గౌడ కులస్తులకు మోకుదెబ్బ అండగా నిలుస్తుందని తెలియజేశారు.గౌడ కులస్తుల సమస్యల పరిష్కారం కోసం మోకుదెబ్బ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా బలమైన నిర్మాణాన్ని ఏర్పటుచేసి త్వరలోనే గౌడ కులస్తుల సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో రాష్ట్ర నాయకులను తెప్పించి భారీ సభను ఏర్పాటు చేసి పేద గౌడ కులస్తుల పక్షాన నిలబడుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పల్లె గౌడ కులస్తులు భైరగోని సాయగౌడ్,బూరుగు రాజు గౌడ్,ఉదగామ్ బాలరాజ్ గౌడ్,రంగారి పోషగౌడ్,బొంగోని ఆంజనేయులు గౌడ్,ఉదగామ్ సత్యనారాయణ గౌడ్,ఏనుగంటి వివేక్ గౌడ్,భైరగోని సచిన్ గౌడ్,బొంగోని నవీన్ గౌడ్,ఏనుగంటి మహేష్ గౌడ్,భైరగోని సిరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బహిష్కరణలపై రాష్ట్ర బీ.సీ కమిషన్ కు ఫిర్యాదులు

ఉద్యమపోరు, నిజామాబాద్, అక్టోబర్ 07 : సామాజిక బహిష్కరణ ఉదంతాలపై తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి.కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ నేతృత్వంలో సభ్యులు తిరుమలగిరి సురేందర్,రాపోలు జయప్రకాశ్,బాల లక్ష్మి లతో కూడిన బృందం బుధవారం నిజామాబాద్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బాధితులతో భేటీ అయ్యింది.ఐ.డీ.ఓ.సీకి చేరుకున్న కమిషన్ ప్రతినిధులను కలెక్టర్ ఇలా త్రిపాఠి,అదనపు కలెక్టర్ వి.భుజంగరావు తదితరులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా సాంఘిక,కుల బహిష్కరణలకు గురైన బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కమిషన్ చైర్మన్,సభ్యులకు లిఖితపూర్వకంగా విజ్ఞాపనలు సమర్పించారు.బాధితులు నిర్భీతితో,స్వేచ్ఛగా వారి అభిప్రాయాలను వెల్లడించేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేశారు.దీంతో జిల్లాలోని ఆయా ప్రాంతాలలో గ్రామాభివృద్ధి కమిటీల పేరిట కొనసాగుతున్న అరాచకాల గురించి,సామాజిక బహిష్కరణ ఘటనలను బాధితులు కమిషన్ కు ఏకరువు పెట్టారు.బీసీ కుల సంఘాల నాయకులు,వివిధ వర్గాల వారు,ప్రజా సంఘాల ప్రతినిధులు సైతం హాజరై రాతపూర్వకంగా విజ్ఞాపనలు కమిషన్ కు అందిస్తూ,మౌఖికంగా కూడా తమ అభిప్రాయాలను వెల్లడించారు.సాంఘిక బహిష్కరణలపై ఫిర్యాదులు సమర్పించేందుకు హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
గురువారం 08.10.2026

మత్తు పదార్థాల రవాణా,విక్రయాలపై ఉక్కుపాదం మోపాలి

- ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి
- కలెక్టర్ తో కలిసి ఎక్సైజ్ అధికారులతో సమీక్ష

ఉద్యమపోరు, నిజామాబాద్, అక్టోబర్ 07 : మత్తు పదార్థాలు,మాదకద్రవ్యాల రవాణా,విక్రయం,వినియోగంపై గట్టి నిఘా కొనసాగించాలని,అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఎక్సైజ్ తదితర శాఖల అధికారులతో ప్రభుత్వ సలహాదారు సమీక్ష జరిపారు.మత్తు పదార్థాల నియంత్రణకు చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకుని,అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఇటీవలి కాలంలో పల్లెల్లో గుడుంబా,నాటుసారా విక్రయాలు మళ్ళీ మొదలైనట్లు తెలుస్తోందని,ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసే ఇలాంటి మత్తు పదార్థాల నిరోధానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు.యువతను,విద్యార్థులను మత్తుకు బానిసలుగా మారుస్తూ వారి భవిష్యత్తును అంధకారంగా మారుస్తున్న గంజాయి విక్రయాలపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు.ఎన్ ఫోర్సుమెంట్,ఎక్సైజ్ బృందాలు సంయుక్తంగా దాడులు నిర్వహించాలని,ఎక్కడ కూడా మత్తు పదార్థాల జాడ కానరాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు.అదేవిధంగా కల్తీకల్లు విక్రయాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలన్నారు.ఎక్కడైనా కల్తీ కల్లు కారణంగా అవాంచనీయ ఘటనలు జరిగితే,అందుకు ఎక్సైజ్ అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.కల్తీ కల్లు తయారీ కోసం వినియోగిస్తున్న అల్ప్రాజోలం,డైజోఫాం,క్లోరోఫాం ఎక్కడి నుండి వస్తుంది,సరఫరాదారులు ఎవరు అనే మూలాలను అన్వేషించి,సూత్రధారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ....మత్తు పదార్థాలు,మాదకద్రవ్యాలను రవాణా చేసే వారిని,వాటిని విక్రయిస్తున్న వారిని,వాటిని వినియోగిస్తున్న వారిని పక్కాగా గుర్తిస్తూ నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు.అవసరమైతే పోలీసు శాఖ సహకారం తీసుకోవాలని,జిల్లాలో ఎక్కడ కూడా గ ంజాయి, క్లోర ల్ హైడ్రేట్,డైజోఫామ్,అల్ప్రాజోలం,గుడుంబా, నాటుసారా వంటివి ఉనికిలో లేకుండా జిల్లాను మత్తు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు.పాఠశాలలు,కళాశాలలకు 100 మీటర్ల దూరం లోపు సిగరెట్లు,గుట్కాలు వంటి విక్రయాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,జిల్లా రెవెన్యూ అధికారి గీత,ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీధర్,సూపరింటెండెంట్ నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానం భారత రాజకీయాల్లో నవశకం

- బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి

ఉద్యమపోరు, నిజామాబాద్, అక్టోబర్ 07 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజ్యాంగబద్ధ ప్రజాప్రతినిధిగా(ముఖ్యమంత్రి,ప్రధానమంత్రి) ప్రజా జీవితంలో విజయవంతంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి అధ్యక్షతన "వికసిత్ భారత్" నిర్వచించారు.సభకు భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు,ప్రజలు తరలివచ్చారు.సభ అనంతరం భారీ 'సేవా జ్యోతి కలశ యాత్ర' బైక్ ర్యాలీని చేపట్టారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ....నరేంద్ర మోదీ 25 ఏళ్ల పరిపాలనా ప్రస్థానం భారతదేశ రాజకీయ చరిత్రలో ఒక నవశకానికి నాంది పలికిందని కొనియాడారు.జీవితంలో ఎన్నడూ బ్యాంకు గుమ్మం తొక్కని కోట్లాది మంది నిరుపేదలకు జన్ ధన్ ఖాతాలు తెరిపించి దేశ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేశారు.కట్టెల పొయ్యి పొగతో అనారోగ్యం బారిన పడుతున్న కోట్లాది మంది పేద తల్లులు,అక్కాచెల్లెళ్లకు 'ఉజ్వల' గ్యాస్ కనెక్షన్లు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపారు.పీఎం 'ఆవాస్ యోజన' ద్వారా ప్రతి పేదవాడి సొంతింటి కలను నిజం చేయడంతో పాటు,'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా నేరుగా అన్నదాతల ఖాతాల్లో పెట్టుబడి సాయాన్ని జమ చేస్తున్నారు.గతంలో ఉగ్రవాదులు దాడులు చేస్తే శాంతి చర్చల పేరిట కాలయాపన చేసేవారని,కానీ నేడు మోదీ నాయకత్వంలో సరిహద్దులు దాటి సర్జికల్ స్ట్రైక్స్,బాలాకోట్ ఎయిర్ స్ట్రైక్స్‌తో ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టిన బలమైన సైనిక సత్తాను ప్రపంచానికి చాటామని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని,రాష్ట్రంలో ఎటువంటి అవినీతి లేని పారదర్శక డబుల్ ఇంజిన్ పాలన తీసుకురావడానికి ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు.'సబ్ కా సాథ్,సబ్ కా వికాస్,సబ్ కా విశ్వాస్,సబ్ కా ప్రయాస్' మంత్రంతో దేశాన్ని ప్రపంచ అగ్రపీఠం వైపు నడిపిస్తున్న మోదీ కి సారంగాపూర్ ఆంజనేయ స్వామి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు.'సేవా సంకల్ప్ అభియాన్' – 'అంగన్ మిలన్ సేవ' కార్యక్రమంలో భాగంగా ఇందూర్ అర్బన్ నియోజకవర్గంలోని అంగన్‌వాడీ టీచర్లకు దినేష్ పటేల్ కులాచారి,పల్లె గంగారెడ్డి,మహిళా మోర్చ నాయకులు శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశాం.జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ....ప్రపంచంలోనే ఏ నాయకుడికి సాధ్యం కాని రీతిలో అలుపెరుగని ప్రజాసేవ చేస్తున్న ఏకైక కర్మయోగి నరేంద్ర మోదీ అన్నారు.దీపావళి వంటి పండుగలను సైతం స్వంత కుటుంబంతో కాకుండా దేశ సరిహద్దుల్లో కాపలా కాసే సైనికుల మధ్య గడుపుతూ,140 కోట్ల భారతీయుల రక్షణ,క్షేమం కోసం రోజుకు 18 గంటలకు పైగా నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు.ప్రపంచస్థాయి ఎక్స్‌ప్రెస్‌వేలు,అత్యాధునిక అంతర్జాతీయ విమానాశ్రయాలు,స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'వందే భారత్' రైళ్లు నవభారత అభివృద్ధి వేగానికి అద్దం పడుతున్నాయని చెప్పారు.దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాంతీయ రైల్వే ప్రాజెక్టులు,జాతీయ రహదారుల విస్తరణను మోదీ శరవేగంగా పూర్తి చేయిస్తున్నారని కొనియాడారు.2047 నాటికి భారతదేశాన్ని సంపూర్ణ అగ్రరాజ్యంగా మార్చడమే లక్ష్యంగా మోదీ 'వికసిత్ భారత్' వైపు అడుగులు వేయిస్తున్నారని, స్వయం సమృద్ధ, స్వావలంబన కలిగిన దేశ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ యొక్క కార్యక్రమంలో గద్దె భూమన్న, కంచెట్టి గంగాధర్,భరత్ రెడ్డి,నాగొల్ల లక్ష్మి నారాయణ, నిమ్మల శ్రీనివాస్, ప్రమోద్ కుమార్,జ్యోతి,న్యాలం రాజు, రాంచందర్,సురేంధర్,బొబ్బిలి వేణు,విజయ్ కృష్ణ,ఓం సింగ్, పిల్లి శ్రీకాంత్, వంశీ గౌడ్, జిల్లా పదాధికారులు, కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, బిజేవైయం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాపయ్య సార్ మృతికి పూర్వ విద్యార్థుల సంతాపం

ఉద్యమపోరు, మంథని, అక్టోబర్ 07 : మండలంలోని కన్నాల గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా సుమారు 30 సంవత్సరాల పాటు సేవలందించిన నగునూరి పాపయ్య సార్ అకాల మరణం పట్ల కన్నాల గ్రామ పూర్వ విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పాపయ్య తన సుదీర్ఘ సేవా కాలంలో గ్రామంలోని ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారని వారు గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలను గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు స్మరించుకున్నారు.బుధవారం పాపయ్య ద్వాదశ దినకర్మ సందర్భంగా హైదరాబాద్‌లోని ఆయన స్వగృహానికి వెళ్లిన కన్నాల గ్రామ ప్రముఖులు, పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పాపయ్య కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్, మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, చిదురాల సురేందర్‌రెడ్డి, గాదె సంజీవ్‌రెడ్డి, ముసుకుల రమేష్‌రెడ్డి, రమణారెడ్డి, బెల్లంకొండ భూమారెడ్డి, సదానందం గౌడ్, రాములు, వెంకట్‌రెడ్డి, సందీప్, అన్నం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హైతాబాద్ గ్రామపంచాయతీ లోని అంకుగూడ గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం

- 20 పశువులకు సుడి పరీక్షలు.
- * 5 పశువులకు కృత్రిమ గర్భధారణ

ఉద్యమపోరు, షాబాద్, అక్టోబర్ 7 : షాబాద్ మండలం హైతాబాద్ గ్రామపంచాయతీ పరిధిలోని అంకుగూడ గ్రామంలో రాష్ట్ర పశు ఘన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైతాబాద్ గ్రామ సర్పంచ్ శాంతమ్మ యాదయ్య, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పశుపోషకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.రేగడిదోస్వాడ పశు వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న ఆధ్వర్యంలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 20 పశువులకు సుడి పరీక్షలు నిర్వహించడంతో పాటు 5 పశువులకు కృత్రిమ గర్భధారణ కార్యక్రమాన్ని చేపట్టారు. పశువుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన వైద్య సూచనలు, పశుపోషణపై అవగాహన కల్పించారు.పశువులకు సకాలంలో వైద్య పరీక్షలు చేయించడం, వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, మెరుగైన పశు సంరక్షణ పద్ధతులను పాటించడం వల్ల పశుపోషకులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని వైద్య సిబ్బంది సూచించారు. పశువుల ఆరోగ్యంతో పాటు పాల ఉత్పత్తి పెంపొందించేందుకు ప్రభుత్వం అందిస్తున్న పశు వైద్య సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలాపూర్ డివిజన్ 62 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నీరుడి శ్రీరాములు. ఆధ్వర్యంలో ప్రభుత్వం చెపడుతున్న వివిధ సంక్షేమ పథకాలలో భాగంగా - స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ఉద్యమపోరు, మహేశ్వరం, అక్టోబర్ 07 : మహేశ్వరం నియోజకవర్గం బడంగ్పేట్ సర్కిల్ బాలాపూర్ గ్రామం 62వ డివిజన్ పరిధి. ఈ కార్యక్రమనికి.కాంగ్రెస్ పార్టీ పీసీసీ కార్యదర్శి ఎలమేటి అమరేందర్ రెడ్డి గారు బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కాంగ్రెస్ పార్టీ ఫోర్ లీడర్ మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి గారు★ మాజీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బాల్ లింగని జంగయ్య. రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు క్యారే గారి శ్రీధర్. .హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్ రెడ్డి. గిరుకటి కృష్ణంరాజు గౌడ్. టేకుల శశిధర్ రెడ్డి బోనగిరి శ్రీనివాస్ పగడాల ఉమేష్ టేకుల సుధాకర్ రెడ్డి ఇక్క వెంకటేశ్వర్లు(కొండల్) ఇక్క శ్రీనివాస్ వందేటి మధుసూదన్ రెడ్డి మాదపురం అనురాధ మర్రి చంద్రశేఖర్ సన్ రెడ్డి మహిపాల్ రెడ్డి నెల్లూరి సుధాకర్ జొన్నాడ భరత్ కుమార్ గండికోట యాదయ్య దొబ్బ రవి బొర్ర రమేష్ చింతకింది భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

అఖిలపక్ష నిరసనకు స్వచ్ఛందంగా తరలి రండి

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు పేరం వెంకటేశ్వర్లు

ఉద్యమపోరు, పినపాక, అక్టోబర్ 7 : కలెక్టరేట్ కార్యాలయం ముందు అఖిల పక్షం ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు పేరం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. పినపాక మండలం జానంపేట గ్రామంలో ఆయన బుధవారం మాట్లాడుతూ పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపుమేరకు ఈ నిరసన కార్యక్రమానికి ప్రతి కార్యకర్త స్వచ్ఛందంగా తరలివచ్చి నిరసనను విజయవంతం చేయాలని కోరారు.సర్ కార్యక్రమంలో జరుగుతున్న అవకతవకలపై ఎన్నికల కమిషనర్ తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ నిరసనలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఇల్లందు మండలం ముఖ్య కార్యకర్తల సమావేశంలో

పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

- త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై కార్యకర్తలకు ఎమ్మెల్యే కనకయ్య దిశా నిర్దేశం

ఉద్యమపోరు, ఇల్లందు, అక్టోబర్ 07 : కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిన మన నాయకుడు స్వర్గీయ రాంరెడ్డి వెంకట రెడ్డి ,దామన్న గార్ల కుమారుడు సర్వోత్తమ్ రెడ్డి ని గెలిపించాల్సిన బాధ్యత మనపై చాలా ఉంది– ఎమ్మెల్యే కనకయ్య అన్నారు. ఆది నుండి అంతం వరకు కూడా కాంగ్రెస్ పార్టీలోనే ఉండి కాంగ్రెస్ పార్టీకి సేవ చేసి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కాపాడుకున్న కుటుంబానికి కాంగ్రెస్ శ్రేణులంతా అండగా నిలబడి సర్వోత్తమ్ రెడ్డి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిపించాలి కాంగ్రెస్ శ్రేణులు ఇల్లందు మండలంలో ప్రతి గ్రామంలో గ్రాడ్యుయేట్ పూర్తయిన యువత వద్దకు వెళ్లాలి వారి ఓటు హక్కును నమోదు చేయించాలి గతంలో ఓటు వేసిన వారిని మరల రెన్యువల్ చేసుకోవాలని గుర్తు చేయాలి అన్ని పార్టీల వారు ఎమ్మెల్సీ ఎలక్షన్స్ దగ్గర పడుతున్న తరుణంలో ఫ్రీగా ఓటు నమోదు చేయిస్తామని బయట చెప్పుకుంటున్నారు కానీ కాంగ్రెస్ పార్టీ ప్రతి అర్హుడైన పేదవాడికి ప్రతి కుటుంబానికి సన్నబియ్యం,స్మార్ట్ రేషన్ కార్డు,ఉచిత విద్యుత్, ఉచిత బస్సు,స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు,ఇందిరమ్మ ఇల్లు వంటి అన్ని పథకాలను ఉచితంగానే ఇస్తుంది అది మనకి వారికి తేడా యువతకి ప్రజా ప్రభుత్వ ఏర్పడిన తర్వాత 70 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ఒక కాంగ్రెస్ పార్టీకే సొంతం త్వరలో మరలా ఉద్యోగాలు ఇవ్వబోతున్నాం కొన్నిటికి నోటిఫికేషన్లు ఇచ్చాము అన్నారు త్వరలో రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయబోతున్నాం బిఆర్ఎస్,బిజెపి పార్టీల వారు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లు కేవలం ఉచితంగానే ఇస్తారు తప్ప వారి గత బిఆర్ఎస్ పది ఏళ్ళ పాలన,బిజెపి గత 15 ఏళ్ల పాలనలో ప్రజలకు ఉచితంగా ఇచ్చింది ఏమీ లేదు,సంక్షేమ అభివృద్ధి లేదు ఈరోజు నుండి ఇల్లందు మండలంలో ప్రతి గ్రామంలో కార్యకర్తలు అందరూ గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన యువత వద్దకు వెళ్లాలి,వారికి ఓటు హక్కు నమోదు చేయించాలి, గతంలో ఓటు వేసిన వారివి రెన్యూవల్ చేయించాలి,మన క్యాంప్ కార్యాలయంలో ఉచితంగానే గ్రాడ్యుయేట్ పూర్తయిన యువత అందరికి కూడా ఓట్లు నమోదు చేస్తాంసర్వోత్తమ్ రెడ్డి గారి గెలుపు యువత ఉద్యోగానికి, ఆర్థికంగా బలోపేతానికి మలుపు అని కార్యకర్తలు అందరు యువతలోనికి బలంగా తీసుకు వెళ్ళాలి అని ఎమ్మెల్యే అన్నారు ఈ కార్యక్రమం లో మండలం నాయకులు హాజరు ఐయ్యారు

నిజామాబాద్ లో ఇండియా కూటమి ఆధ్వర్యంలో ధర్నా

- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మ దహనం

ఉద్యమపోరు, నిజామాబాద్, అక్టోబర్ 07 : బుధవారం నిజామాబాద్ లోని ధర్నా చౌక్ వద్ద ఏఐసీసీ,పీసీసీ ఆదేశాల మేరకు ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగేష్ రెడ్డి అధ్యక్షతన కేంద్ర ఎన్నికల సంఘము కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని ధర్నా నిర్వహించి,జ్ఞానేశ్ కుమార్ దిష్టి బొమ్మ దహనం చేశారు.ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు నగేష్ రెడ్డి మాట్లాడుతు....కేంద్ర ఎన్నికల కమిషనర్ బీజేపీ ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహారిస్తునరని,దేశంలో 13కోట్లకు పైగా ఓట్లనీ తొలగించారని,రాష్ట్రంలో దాదాపు 90లక్షలు పైగా,జిల్లాలో అర్బన్లో దాదాపు 80వేలకు పైగా ఓట్లు తొలగించారని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహారిస్తూ ప్రజాస్వామ్యాన్ని అణిచివేసేవిధంగా ఈ ఎన్నికల కమిషనర్ వ్యవహారిస్తున్నారని మండిపడ్డారు.మా పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీ కేంద్ర ప్రభుత్వానికి,సీఈసీకి వ్యతిరేకంగా కొట్లాడితే అరెస్టు చేయడం చాలా బాధాకరమన్నారు.కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధాన మంత్రిగా,రాష్ట్రంలో మరోసారి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ సారధ్యంలో మరోసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశభావం వ్యక్తం చేసారు.కేంద్ర ఎన్నికల సంఘము నిర్వహిస్తున్న సర్ ప్రోగ్రాం పూర్తిగా కేంద్రానికి అనుకూలంగా ఉందని,జిల్లాలో పీసీసీ ఆదేశాల మేరకు మండల కేంద్రాల్లో ఇండియా కూటమి ఆధ్వర్యంలో ధర్నాలు,దిష్టి బొమ్మలు దహన కార్యక్రమాలు చేసారాని,ఈరోజు జిల్లా కేంద్రంలో నిర్వహించమని ముున్ముందు గ్రామ స్థాయిలో ఇలాంటి ఆందోళనలు నిర్వహించడం జరుగుతుందన్నారు.కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీనామా చేసేంత వరకు మున్ముందు ఏఐసీసీ,పీసీసీ ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ,సీపీయం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు,సీపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్,సీపీఐ ఏంఎల్ మాస్ లైన్ అర్బన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ,ఆర్ఎస్పి జిల్లా కార్యదర్శి రాములు,నగర మేయర్ ఉమారాణి,కల్లుగీత కార్మిక చైర్మన్ శేఖర్ గౌడ్,నూడా చైర్మన్ కేశ వేణు,వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్,మాజీ ఎమ్మెల్సీలు అరికెల నర్సారెడ్డి,ఆకుల లలిత,ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జి వినయ్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ భూపాల్,మహిళ నాయకులు,జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,నగర కార్పొరేటర్లు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పవన్ ప్లాస్టిక్ కుర్చీ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం

రూ. 1 కోటి 74 లక్షల ఆస్తి నష్టం

ఉద్యమపోరు, మహేశ్వరం, అక్టోబర్ 07 : మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం శంషాబాద్ జిహెచ్ఎంసి పరిధి జల్ పల్లి సర్కిల్ 17. జల్ పల్లి గ్రామం పవన్ ప్లాస్టిక్ కుర్చీల కంపెనీలో నిన్న రాత్రి 1 35 నిమిషాల సమయంలో భారీ శబ్దాలతో మంటలు చల రేగడంతో అప్రమత్తమైన వాచ్మేన్ పాడిసరి పోలీస్ స్టేషన్ సంప్రదించడంతో హుటాహుటిన చేరుకున్న పోలీసు వారు ఫైర్ ఇంజన్ రప్పించి మంటలు ఆర్పియడం జరిగింది పవన్ ప్లాస్టిక్ కుర్చీ కంపెనీ ఓనర్ దిలీప్ మాట్లాడుతూ రూ–1 కోటి 74 లక్షల ఆస్తి నష్టం జరిగిందని చెప్పారు

ఓపెన్ నాలాకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు

- బాక్స్ డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ఉద్యమపోరు, మహేశ్వరం, అక్టోబర్ 07 : మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ సర్కిల్ 57వ డివిజన్ అల్మాస్‌గూడ పరిధిలోని సౌభాగ్య లక్ష్మీ నగర్ కాలనీ నుంచి పోచమ్మ కుంట వరకు ఉన్న ఓపెన్ నాలాపై బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులకు మాజీ మంత్రివర్యులు, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డ. శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గారు మాట్లాడుతూ, ఓపెన్ నాలా కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా బాక్స్ డ్రైన్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు.బాక్స్ డ్రైన్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, సంబంధిత కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే సూచించారు.ఈ బాక్స్ డ్రైన్ నిర్మాణంతో ఓపెన్ నాలా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు, పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్లు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకురాలు, కాలనీవాసులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళన భూసేకరణ రైతులకు న్యాయం జరిగేలా ఉండాలి

- మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ ఏనుగు సుదర్శన్ రెడ్డి

ఉద్యమపోరు, ఘట్కేసర్, అక్టోబర్ 07 : మూసీ ప్రక్షాళన, అభివృద్ధి పేరుతో రైతుల భూములకు సంబంధించిన చర్యలు చేపట్టే సమయంలో రైతుల హక్కులు, ప్రయోజనాలను కాపాడేలా ప్రభుత్వం స్పష్టమైన, చట్టబద్ధమైన విధానాన్ని అమలు చేయాలని మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ ఏనుగు సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండలం కొర్రెముల లో మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్, భూసేకరణ గురించి గ్రామ సభ నిర్వహించారు. ఘట్కేసర్ తహసీల్దార్ బి. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ ఏనుగు సుదర్శన్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజల కోసం ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలకు తాము వ్యతిరేకం కాదనీ, రైతుల భూములకు సంబంధించిన నిర్ణయాలు తీసుకునే ముందు వారితో సంప్రదింపులు జరిపి చట్టప్రకారం న్యాయమైన పరిహారం, అభివృద్ధిలో సముచిత వాటా కల్పించాలని కోరారు. గతంలో హెచ్ఎండీఏ పరిధిలో ప్రతిపాదించిన విధానంలో రైతులకు 60 శాతం, ప్రభుత్వానికి 40 శాతం వాటా కల్పించిన అంశాన్ని పరిగణనలోకి తీసుకుని, ప్రస్తుత పరిస్థితుల్లో కూడా రైతులకు న్యాయం జరిగే విధంగా విధానం రూపొందించాలని అన్నారు. రైతుల వద్ద తీసుకునే ఎకరా భూమికి 1,741 గజాల అభివృద్ధి చేసినస్థలం ఇవ్వాలని, భూములకు న్యాయమైన పరిహారం కల్పించాలని డిమాండ్ చేశారు.

Printed, Published and Owned by Bandari Srujana, on behalf of Sri Venkateswara Printing Solutions, Editor - Bandari Sumanth, is responsible for news selection under PRB act prgi.gov.in RNI.TGTEL/26/A7716, # 19-212/3-3A, Narsampet, Warangal, Telangana, India - 506132, Cell : 7569337969 Email:udyamaporu@gmail.com